క్లుప్తంగా

ఉచిత వేసవి శిక్షణ

మాచర్ల: పట్టణంలోని సొసైటీ కాలనీలో ఉన్న సాయిబాబా మందిరం పక్కన సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను సత్యసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ మాచర్ల అభయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెంటర్ నందు 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచిత శిక్షణ సత్యసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ స్థానిక నిర్వాహకులు జక్కా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం వారు విలేకరులకు సమాచారం అందిస్తూ వచ్చే నెల 6వ తేదీ వరకు ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా విద్యార్థులకు నైతిక, ఆధ్యాత్మిక విలువలు, ఏకాగ్రత పెంపొందించడంతో పాటు విద్యార్థులకు భవితకు బాటలు వేసేందుకు కృషిచేయాలన్నారు. మరిన్ని వివరాలకు : 8985619332ను సంప్రదించాలని కోరారు.

గురజాల : వేసవి శిక్షణ శిబిరాలు సోమవారం నుంచి ప్రారంభమైయ్యాయి. స్థానిక గ్రంథాలయంలో సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి సీహెచ్ హీమ భార్గవి మాట్లాడుతూ శిక్షణ శిబిరాల్లో స్పోకెన్ ఇంగ్లిషు, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, చదరంగంతో పాటు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచే విదంగా చూడడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వేసవి సెలవుల్లో విద్యార్థులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కారెంపూడి: స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎన్ నయోమి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదివి ఉండాలని, ఓసీ, బీసీ విద్యార్థులు 01-09-2011 నుంచి 31-08-2013 మధ్య జన్మించిన వారై ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2009 నుంచి 30-08-2013 మధ్య జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. జూన్11వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య ప్రవేశ పరీక్ష పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలుగు, ఇంగ్లిషు మీడియంలలో విద్యాబోధన ఉంటుందన్నారు.

కారెంపూడిలో స్పందన



కారెంపూడి: కారెంపూడి గ్రామ సచివాలయం – 1లో తహసీల్దార్ జి శ్రీనివాస్ యాదవ్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలను తహసీల్దార్‌కు సమర్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారానికి ఒక గ్రామ సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పిస్తే వాటిని వివిధ శాఖలకు పంపి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వో కృష్ణప్రసాద్, గ్రామ పంచాయతీ, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్పందనకు నాలుగు అర్జీలు

మాచర్ల రూరల్: ప్రతి సోమవారం కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి నాలుగు అర్జీలు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ షేక్ భాషా తెలిపారు. పట్టణంలో డిజె ఊరేగింపులు నివారించి ప్రజల ఆరోగ్య రీత్యా శబ్ద కాలుష్యాన్ని నివారించాలని కె క్రాంతి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పేరుకుపోయి దోమలకు నిలయంగా మారిందని, వాటిని తొలగించాలని గాదె సుధాకర్‌రెడ్డి, ముస్లింలకు చెందిన 16 సెంట్ల భూమిలో కొలతలు కొలిచి హద్దులు చూపించాలని ముస్లిం నాయకులు షేక్ మస్తాన్, బాషా, వీఏఓల సమస్యలు పరిష్కరించాలని సంఘ నాయకులు శ్రీనివాసరావులు వినతి పత్రం అందజేశారు.

నేడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

కారెంపూడి: ఎంపీటీసీ సభ్యులతో మండల పరిషత్తు సర్వ సభ్య సమావేశం ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంగళవారం ఉదయం 11.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అందరు గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, అలాగే గ్రామ స్థాయి అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు. వివిధ శాఖల అభివృద్ధిపై రివ్యూ నిర్వహించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు.

దేవాలయ భూములు కాపాడాలి

దాచేపల్లి : స్థానిక ముత్యాలంపాడు రోడ్డులోని శివాలయం, నాగేంద్రస్వామి దేవాలయం భూములు కాపాడాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం తహసీల్దార్ తానంగి ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఆలయ భూములను పరిరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అంబటి నవకుమార్ కోరారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు.

గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



దుర్గి 2 సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని గత పాలకులు నిర్లక్ష్యం కారణంగా సాధించలేకపోయిన ఆయన స్ఫూర్తితో గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పరచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని పల్నాడు జిల్లా అభివృద్ధి మండల చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన దుర్గిలో రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన దుర్గి 2 గ్రామ సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు దాదాపుగా 500లకు పైగా పౌర సేవలను అందిస్తూ దేశంలోనే ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. గ్రామాల్లో వలంటీర్ వ్యవస్థతో పాటు ప్రతి సచివాలయంలో 10 నుంచి 15 మంది ఉద్యోగులను నియమించి ప్రజలకు అందుబాటులో సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, ఎంపీపీ యేచూరి సాయి శంకర్, సర్పంచ్ రాయపాటి మాణిక్యం, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్, యూత్ కన్వీనర్ యకటీల బుచ్చిబాబు, నాయకులు కటకం చిన వెంకటయ్య, ఊరిబండి మన్నెయ్య, తోటకూర నాగేశ్వరరావు, చల్లా శ్రీనివాస్, గూడా కోటేశ్వరరావు, బత్తుల శ్రీను, ఎంపీటీసీ కటకం గోపాల్, పసుపులేటి వెంకట్రామయ్య, చింతా రామకృష్ణ, యకటీల శ్రీను, చలవాది సత్యనారాయణ, కటకం గోపాల్, తోటకూర వెంకటేశ్వర్లు, చింతా నరసింహారావు, జక్కా బాజి, జక్కా కొండలు, శెట్టిపల్లి కోటేశ్వరరావు, నారాయణ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్, పంచాయతీ రాజ్ ఏఈ వెలుగొండా రెడ్డి, ఏఓ వై అమీర్‌రెడ్డి, పలువురు గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో జయం మనదే

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి: దుర్గిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ మండల పార్టీ కార్యాలయాన్ని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం ఆయన ప్రసంగించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించి అండగా నిలిచారని పేర్కొన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలతో పాటు పార్టీ పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటుకు సహకరించిన మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, పార్టీ మండల యూత్ కన్వీనర్ యకటీల బుచ్చిబాబులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, ఎంపీపీ యేచూరి సాయి శంకర్, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్, నాయకులు కటకం చిన వెంకటయ్య, పాలవాయి బ్రహ్మారెడ్డి, నాలి రామయ్య, ఊరిబండి మన్నయ్య, సర్పంచ్‌లు రాయపాటి మాణిక్యం, నలబోతు వెంకటేశ్వర్లు, తోటకూర నాగేశ్వరరావు, గంగారపు వెంకటరెడ్డి, మమ్ము శివరాం, జక్కా రమేష్, మాదాసు వెంకటేశ్వర్లు, కపలవాయి శ్రీను, ఎంపీటీసీలు పసుపులేటి వెంకటరామయ్య, బొంతా కృష్ణ, మమ్ము శ్రీనివాసరావు, తోట మూర్తి, జంగా కొండలు, కపలవాయి సూర్యనారాయణ, మద్దికర ఆదిరెడ్డి, సుబ్రహ్మణ్యం నాయక్, కపలవాయి వెంకటప్పయ్య, కటకం గోపాల్, గూడా రామకృష్ణ, వెలిదండి చంద్రజ్యోతి పలువురు నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వితరణ



మాచర్ల: పుస్తక పఠనం ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయంలో చదువుకుని ముందుకు వెళ్ళాలని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తన కుమారుడు బోయ గణేష్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ. 10వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలందిస్తానన్నారు. గ్రంథాలయ అధికారి పోలిశెట్టి పుల్లారావుకు అందించగా నాయకులు కిరీటిరెడ్డి, సభ్యులు లాలుసాహెబ్, ఆయేషా తదితరులున్నారు.

క్రికెట్ టోర్నమెంట్

పిడుగురాళ్ల: పట్టణంలోని కళ్లంటౌన్ షిప్‌లో స్కాలర్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో కాసు కోసం లోకల్ యూత్ ఆధ్వర్యంలో వై నాట్ 175 జగనన్న నా కౌట్ క్రికెట్ ట్రోఫీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. మొదటి బహుమతి 1,75,175, ట్రోఫీ, రెండవ బహుమతి 1,00,175, ట్రోఫీ, మూడవ బహుమతి 60,175, ట్రోఫీ నిర్వహించడం జరుగుతుందన్నారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ 15,175, ట్రోఫీ, బెస్ట్ బ్యాట్స్‌మెన్ 10,175, ట్రోఫీ, బెస్ట్ బౌలర్ 10,175, ట్రోఫీ అందించడం జరుగుతుందన్నారు. ఎంట్రీఫీజు 5,175, ఈ నెల 12వ తేదీన డ్రా తీయడం జరుగుతుందని తెలియజేశారు. మ్యాచ్ ప్రారంభం ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు. వివరాలకు ఎం. దయాకర్ : 99638 93323, ఎ. పుల్లారావు 8074111395 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

సాగుకు సమాయత్తం కావాలి

ఏఓ పాపకుమారి

దాచేపల్లి : రైతులు సాగుకు సమయత్తం కావాలని ఏఓ డి. పాపకుమారి అన్నారు. మండలంలోని రామాపురం రైతుభరోసా కేంద్రంలో 2023–24 సాగు సమయత్తం కార్యక్రమంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. కౌలు రైతుల కార్డులు, ఈ క్రాప్ బుకింగ్, ఉచిత పంటల బీమా, కిసాన్ డ్రోన్స్, పత్తి, మిరప, వరి పంటల సాగులో యాజమాన్య, సస్య రక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. బిందు సేద్యం పద్ధతులపై అవగాహన కల్పించి 5 ఎకరాల లోపు సేద్యం చేస్తే 90 శాతం సబ్సిడీ, 5 ఎకరాల పైబడి సేద్యం చేస్తే 50 శాతం సబ్సిడీ వస్తోందని రైతులకు ఏఓ పాపకుమారి వివరించారు. ఈ సమావేశంలో రైతులతో పాటు ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం బృందం సర్వే



సర్వే చేపడుతున్న ఎన్‌హెచ్‌ఎం సర్వే బృందం సభ్యులు, పీహెచ్‌సీ సిబ్బంది

రెంటచింతల: రెంటచింతలలోని 300 కుటుంబాల ఆరోగ్య స్థితిగతులను ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ ఫ్యామిలీ హెల్త్ మిషన్) బృందం సర్వే చేసినట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. పల్నాడు జిల్లా వైద్యాధికారి డి.శోభారాణి పర్యవేక్షణలో ఈ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే బృందం సభ్యులు ఐ.రాజు, కేఎల్ రాజు ఒక్కొక్క ఇంటికి వెళ్లి ఆ కుటుంబాల ఆరోగ్యస్థితిగతుల వివరాలను సేకరించడం జరిగిందన్నారు. కుటుంబ నియంత్రణ సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, మాతా శిశుసంరక్షణ, రక్తహీనత, పోషణ, నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. త్వరలో మరో సారి ఈ సర్వే బృందం పర్యటించి ఆయా కుటుంబాలకు చెందిన సభ్యులకు 27 రకాల ఆరోగ్య(వైద్య) పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పూజల నాగేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శిడిమాను మహోత్సవం



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు



శిడిమానుతో గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

రెంటాల(రెంటచింతల): మండలంలోని రెంటాల గ్రామంలో ఆదివారం పోలేరమ్మతల్లికి చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా భక్తులు బోనాలను మేళతాళాలతో భక్తి శ్రద్ధలతో సమర్పించగా సోమవారం శిడిమానుతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం 6గం.లనుంచే ఆలయ పండితులు కొండలు నేతృత్వంలో పోలేరమ్మకు, ఆలయ ప్రాంగణంలోని నాగేంద్రస్వామికి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కరరెడ్డి, గ్రామ పెద్దలు ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సకాలంలో వర్షాలు కురిసి పైరుపంటలు సంవృద్ధిగా పండి ప్రతి అన్నదాత ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని వేడుకున్నారు. ఆలయాన్ని రంగురంగు విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు. గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఈ ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా రథోత్సవం



వేణుగోపాలస్వామి వారి రథోత్సవం

గురజాల : మండలంలోని చర్లగుడిపాడులో వేంచేసియున్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత సాక్షి వేణుగోపాలస్వామి వారి రథోత్సవం సోమవారం సాయంత్రం వైభవంగా జరిగింది.. వేకువ జాము నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. వాస్తుహోమం, పరిహరణ, కలశ హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం వేళ రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై వుంచి గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. స్వామి వారికి మహిళలు, భక్తులు నీటితో వారును పోసి స్వామి వారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలు కారెంపూడి రాఘవచార్యులు, వేణుగోపాలచార్యులు, వరదాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని వైఎస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), కావూరి అంజిబాబు, రైల్వే బోర్డు కమిటీ మెంబర్ కొమ్మినేని రవిశంకర్ , మన్నెం ప్రసాద్, వంకాయలపాటి మల్లయ్య, బండ్ల వెంకయ్య తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి విశేష ప్రాముఖ్యతను కల్పించి విద్యార్థి జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అసలైన విద్యాదాతగా నిలిచారని పల్నాడు జిల్లా అభివృద్ధి మండల చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం గత కొన్ని రోజుల క్రితం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పల్నాడు జిల్లాలో మొదటి స్థానం పొందారు. ఈ సందర్భంగా రెండవ సంవత్సరం ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులు గుండెబోయిన శిరీష, బైపీసీలో 1000/ 955, గుండెబోయిన తేజ 935, రామనబోయిన అలేఖ్య సిఈసిలో 835 మార్కులు సాధించి కార్పొరేట్ కాలేజీ ఫలితాలకు దీటుగా సాధించడం అభినందనీయమని ప్రభుత్వ విప్ పీఆర్కే అన్నారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, ప్రిన్సిపల్ వీహెచ్‌వి రమణ, అధ్యాపకులు ఆర్‌విఎస్ ప్రసాద్, కె సుధీర్, ఎ నవీన్‌రెడ్డి, ఎం శివ నాయక్, సీహెచ్ రామకృష్ణ, డి శ్రీనివాసరావు, జి హరిత, ఎం హరిణి తదితరులున్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

ఎస్‌ఐ అనంత కృష్ణ

గురజాల : వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్‌ను విధిగా పాటించాలని ఎస్‌ఐ అనంత కృష్ణ సూచించారు, సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లుకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించి ప్రయాణాలు చేస్తే తమతో పాటు ఇతర ప్రయాణీకులు కూడా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా క్షేమంగా ఇంటికి చేరుతారన్నారు. విధిగా నిబంధనలు పాటించాలన్నారు.

25 శాతం సీట్లు కేటాయించాలి

మాచర్ల: పల్నాడు జిల్లాలో ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రైవేటు పాఠశాలలో ఉచితంగా 25 శాతం సీట్లు కేటాయించేందుకు ప్రత్యేక విద్యా హక్కు చట్టాన్ని కాపాడాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి రాజు కోరారు. సోమవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలల పై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి జి రాఘవేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు కె జోతీష్ కుమార్, చైతన్య బార్గవ్‌రెడ్డి తదితరులున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ రహంతుల్లా సోమవారం తెలిపారు. పెద్దచెరువుకు చెందిన 18 ఏళ్ల యువతి ఆదివారం ఇంటి నుంచి బజారుకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

10 నుంచి రైల్వే గేటు మూసివేత

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామపంచాయతీ శివారు గ్రామమైన కృష్ణాపురం గ్రామంలోని రైల్వే గేటు 269 సమీపాన రైల్వే పనుల్లో భాగంగా భాగంగా ఈనెల 10 నుంచి 17వ తేదీ వరకు గేటు మూసివేస్తున్నట్లు తహసీల్దారు షేక్ జాన్ సైదులు సోమవారం తెలిపారు. రైల్వే అధికారులకు సంబంధిత గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు.

రైతు సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



సొసైటీ అధ్యక్షుడు కటకం రామారావును అభినందిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి: రైతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టి రైతు బాంధవ్యుడుగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిలిచారని పల్నాడు జిల్లా అభివృద్ధి మండల చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం దుర్గిలో నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన కటకం రామారావును అభినందించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ ఋణాలు సక్రమంగా అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సొసైటీలు సంయుక్తంగా రైతు సేవలో పాలుపంచుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ వెలిదండి గోపాల్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్, యూత్ కన్వీనర్ యకటీల బుచ్చిబాబు, నాయకులు కటకం చిన వెంకటయ్య, ఊరిబండి మన్నెయ్య, తోటకూర నాగేశ్వరరావు, చల్లా శ్రీనివాసరావు, చలవాది సత్యనారాయణ, ఎంపీటీసీ కటకం గోపాల్, సత్యం, యలమంద, తోటకూర వెంకటేశ్వర్లు, జక్కా రమేష్, జంగా కొండలు, పసుపులేటి వెంకట్రామయ్య, యకటీల శ్రీను, గూడా రామకృష్ణ, బత్తుల శ్రీను, కటకం వెంకటేశ్వర్లు, కటకం గోపాల్, కల్లూరి రాజేష్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి హామీ పనులు

ఎంపీడీఓ కోటేశ్వరరావు



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వరరావు

మాచర్ల రూరల్: వలసలు నివారించి ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉపాధి హామీ పనులను వేగవంతంగా చేయాలని ఎంపీడీఓ కోటేశ్వరరావు కోరారు. సోమవారం మండలంలోని కంభంపాడు, కొత్తపల్లి, కొప్పునూరు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించి మాట్లాడారు. వేసవి కాలంలో రైతన్నలకు ఉపయోగపడే పనులను గుర్తించి నిర్ణీత కాలంలో పూర్తి చేసి వ్యవసాయానికి అనుకూలంగా ఉండేలా పనులు పూర్తి చేయాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులను అందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఈయన వెంట ఏపీఓ, సర్పంచ్‌లు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారిణిలపై లాఠీచార్జి సిగ్గు చేటు



మాట్లాడుతున్న పీడీఎం, ఎంసీపీఐ, సీపీఐ, ఆర్‌టీఐ, ప్రజాసంఘాల నాయకులు

పిడుగురాళ్ల: రెజ్లింగ్ క్రీడాకారిణిలపై లాఠీ ఛార్జికి పాల్పడడం సిగ్గు చేటు అని పీడీఎం, ఎంసీపీఐ, సీపీఐ, ఆర్‌టీఐ, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. పట్టణంలోని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను వేధిస్తునన బీజేపీ నాయకులను కాపాడుతున్న మోడీ, బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు పదవి నుంచి బీజేపీ ఎంపీ బ్రిజ్ బూషణ్ శరత్‌సింగ్‌ను తక్షణమే తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడాకారుల పట్ల లైంగిక వేదింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ శరత్‌సింగ్‌ను అరెస్టు చేయాలని జంతర్‌మంతర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా క్రీడాకారుల పట్ల పోలీసులు లాఠీచార్జికి పాల్పడడం సిగ్గు చేటు అని వారు అన్నారు. ఒక పక్క బేటీ పడావో బేటీ బచావో అని అంటూ పాలన చేస్తే మహిళలకి రక్షణ కల్పించడలో చిత్తశుద్ధి చూపించడం లేదని, కుస్తీ పోటీల్లో మల్లయోధులుగా దృఢంగా ఉన్న రెజ్లిస్ మహిళలకే రక్షణ లేకపోతే ఇక సాధారణ మహిళలకు రక్షణ ఎలా ఉంటుందన్నారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. తక్షణమే బాధితుడిపై చర్యలు తీసుకోవాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, ఎంసీపీఐ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణనాయక్, ఆర్‌టీఐ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి



మృతిచెందిన కొట్రా మరియబాబు

దాచేపల్లి : విధి నిర్వహణలో ఉన్న కార్మికుడిని విధి కాటేసింది. ట్రిప్పర్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు కార్మికుడిని బలితీసుకుంది. ఈ ఘటన దాచేపల్లి నగర పంచాయతీలో సోమవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో నగర పంచాయతీలో కాంట్రాక్ట్ పద్ధతిలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కొట్రా మరియబాబు(37) మృతువాతపడడంతో కుటుంబం వీధిన పడింది. మరియబాబు నగర పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం తోటి కార్మికులతో కలిసి పారిశుద్ధ్యం పనులు చేసేందుకు ట్రాక్టర్ తీసుకుని కారంపూడి రోడ్డు సెంటర్‌కు వచ్చాడు. రోడ్డు పక్కన పెట్టి ఉన్న ట్రాక్టర్‌లోకి చెత్తను కార్మికులు వేస్తున్నారు. ఈ క్రమంలో పిడుగురాళ్ల వైపు నుంచి అతివేగంతో వచ్చిన ట్రిప్పర్ రోడ్డు పక్కన నిలిచిన ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఒక్కసారిగా కుదుపుకు గురై రోడ్డు డివైడర్ దాటుకుంటూ రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ సీట్లో కుర్చొన్న మరియబాబు డివైడర్ దాటే సమయంలో కిందపడ్డాడు. ట్రాక్టర్ టైర్లు మరియబాబుపై నుంచి వెళ్లాయి. తోటి కార్మికులు హుటాహుటిన స్థానికంగా ఉన్న ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా మరియబాబు మృతిచెందాడు. ఈ ఘటనలో దుకాణాల ముందు ఉన్న తోపుడు బండ్లను సైతం ట్రాక్టర్ ఢీకొట్టటంతో నుజ్జునుజ్జు అయ్యాయి. తోపుడు బండ్లపై పండ్లు అమ్ముకునే నరసింహరావు అనే వ్యక్తికి కూడా గాయాలైయ్యాయి. ఘటనా స్థలాన్ని సీఐ షేక్ బిలాలుద్దీన్, ఎస్‌ఐ శివనాగరాజు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మరియమ్మ, కుమారులు పీటర్‌బాబు, నరేష్ ఉన్నారు. మరియబాబు కుటుంబంకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కాసేపు ఆందోళన చేశారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, మాజీ కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్ చాట్ల క్రాంతికుమార్ మృతుడి కుటుంబంకు న్యాయం జరిగేలా చర్యలు జరిపారు.